క్లుప్తంగా

230 మంది లబ్ధిదారులకు అదనపు సహాయం

వేటపాలెం: మండల పరిధిలో గృహనిర్మాణ శాఖ ద్వారా ఇళ్లు మంజూరై అసంపూర్తిగా నిలిచి పోయిన 230 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం అదనపు సహాయం అందించనుందని గృహనిర్మాణ శాఖ ఏఈ బి. శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. అసంపూర్తిగా నిలిచిపోయిన గృహాలకు సంబంధించి ఎస్సీ లబ్ధి దారులకు 57 మంది, ఎస్టీ లబ్ధిదారులు 35 మంది, వెనుక బడిన తరగతుల లబ్ధి దారులు 138 మంది ఉన్నారని తెలిపారు. అదనంగా ఎస్సీ లబ్ధిదారులకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు, వెనుకబడిన కులాల లబ్ధిదారులకు రూ. 50 వేల చొప్పున అదనపు సహాయం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ లబ్ధిదారులు తిరిగి వారి గృహాల నిర్మాణం కొనసాగించి పూర్తి చేసుకోవడానికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకొని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

చీరాల టౌన్: పొదుపు గ్రూపులు రుణాల చెల్లింపులు సకాలంలో చెల్లించేలా వీఓఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఎం మధుసూదనరావు సూచించారు. బుధవారం బుర్లవారి పాలెంలోని స్త్రీశక్తి భవన్‌లో మండలంలోని వీఓఏలకు ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ మండలంలో ఉన్న పొదుపు గ్రూపుల వద్దకు వీఓఏలు నెలకు ఒకసారి సమావేశాన్ని నిర్వహించి గ్రూపుల ప్రగతిని తెలుసుకోవాలన్నారు. వీఓఏలు పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సమావేశంలో సీసీలు, వీఏవోలు పాల్గొన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచాలి



మాట్లాడుతున్న శేఖరరావు

వేటపాలెం: ఉపాధ్యాయులు తమ పాఠశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని కాంప్లెక్స్ చైర్మన్ ఎం. శేఖరరావు తెలిపారు. పందిళ్లపల్లిలో కాంప్లెక్స్ స్థాయి క్లస్టర్ మీటింగులు ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల స్థాయిలకు అనుగుణంగా నూతన వ్యూహాలు అనుసరిస్తూ, తమ బోధన అభ్యసన పద్ధతులను మార్చు కుంటూ సీ, డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులను మెరుగైన స్థాయికి తీసుకురావాలని సూచించారు. కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి పి. శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.

చెట్టు రూపంలో ప్రమాదం



ప్రధాన రోడ్డు పక్కన ఎండిపోయి ఉన్న వృక్షం

వేటపాలెం: చీరాల నుంచి ఒంగోలు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపు ఎండి పోయిన వృక్షాలతో ప్రమాదం పొంచి ఉంది. వేటపాలెం నుంచి కడవకుదురు వరకు రహదారికి రెండు వైపులో ఉన్న పెద్ద వృక్షాలు ఎండకి ఎండి పోయాయి. ఈ ఎండి పోయిన చెట్లు ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రహదారిలో చీరాల–ఒంగోలు వైపుకు నిత్యం వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. వాహనాలు వెళ్లే సమయంలో ఎండిన చెట్లు వాహనాలపై నా లేదా ద్విచక్రవాహన దారుల పైన పడే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెట్లను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ



మాట్లాడుతున్న ఉపవిద్యాశాఖాధికారి గంగాధర్‌రావు

అద్దంకి: సీ, డీ గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి డి. గంగాధర్ రావు అన్నారు. శ ఖవరప్పాడులో బుధవారం నిర్వహించిన క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడారు. ఉప విద్యాశాఖాధికారి మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో కనీసం నెలకు ఒకసారి ఉపాధ్యాయ సమావేశం నిర్వహించి విద్యార్థుల పురోగతి.. ఉపాధ్యాయుల సన్నద్ధత వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని చెప్పారు. కాంప్లెక్స్ చైర్మన్ చంద్రశేఖర్, హెచ్ఎంలు శ్రీనివాసరావు, శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చీరాల: మహిళా సర్పంచ్‌కు కేక్ తినిపిస్తున్న కరణం వెంకటేష్



అద్దంకి: వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న హనిమిరెడ్డి, నాయకులు



ఇంకొల్లు: వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గాదె మధూసూదనరెడ్డి

పేదల కోసం పుట్టిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ

• ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం

చీరాల: పేదల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పుట్టిందని, బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత కల్పించిందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేల కిలోమీటర్లు పాదయాత్ర చేసి రాష్ట్ర ప్రజలు, బడుగు, బలహీనవర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా పరిశీలించి ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే అమ్మ ఒడి, చేయూత, ఆసరా, వసతి దీవెన, విద్యా దీవెన వంటి ఎన్నో కార్యక్రమాలను ప్రవేశపెట్టి ప్రజల మన్ననలు పొందారన్నారు. అమలు కాని హామీలు ఇచ్చినట్లు అయితే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవారన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజునే యువత పోరు ద్వారా ప్రభుత్వాన్ని నిలదీసేందుకు పార్టీ సిద్ధమైందన్నారు. ఇక నిత్యం ప్రజలతోనే పార్టీ మమేకమై ఉంటుందని, అందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలన్నారు. తాను త్వరలో చీరాల కేంద్రంగా అన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. పార్టీని కష్టకాలంలో ఉన్నప్పుడు ప్రజలు అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు గవిని శ్రీనివాసరావు, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు వాసిమళ్ళ వాసు, పట్టణ అధ్యక్షుడు యాతం మేరిబాబు, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, బూత్ కన్వీనర్స్ నియోజకవర్గ అధ్యక్షుడు శిఖా సురేష్, కౌన్సిలర్లు గొట్టిపాటి ఎబినేజర్, కీర్తి వెంకట్రావు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, పార్టీ నాయకులు కంకణాల నాని, కోడూరి ప్రసాద్‌రెడ్డి, కావూరి రమణారెడ్డి, ఆసాది అంకాలరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్‌చేసి, పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, బల్లికురవ, పంగులూరు మండల కన్వీనర్‌లు దేవినేని కృష్ణ, రావూరి శ్రీను, సర్పంచ్ జి. నగేష్, మాజీ సర్పంచ్ ఉప్పుటూరి సాంబిరెడ్డి, వార్డు కౌన్సిలర్ గుంజి కోటేశ్వరరావు, స్థానిక నాయకులు రవి, ఉడత్తు సురేష్, గుప్త, బాజి, కె. భువనేశ్వరీ, మండలస్థాయి నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంకొల్లు(చినగంజాం): వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇంకొల్లు మండలంలోని పావులూరులో వైఎస్సార్ విగ్రహానికి పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ గాదె మధుసూదన్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మండల కన్వీనర్ చిన్ని పూర్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వైఎస్సార్ సీపీ జెండా ఆవిష్కరించారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ పరిధిలోని నాయకులు, కార్యకర్తలు అంతా పార్టీ కోసం కలిసి కట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బండారు ప్రభాకరరావు, భవనం శ్రీనివాసరెడ్డి, షంషుద్దీన్, ఉప్పలపాటి అనిల్, మువ్వల రాంబాబు, కర్రి వాసు,లక్ష్మయ్య, సునీల్, బిల్లాలి డేవిడ్, గుంటూరు శ్రీను, అజయ్, జయరామిరెడ్డి, వెన్ను సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు.. నిరుద్యోగ భృతి లేవు



చీరాల: దివ్యాంగులతో కలిసి ర్యాలీగా బయలుదేరుతున్న కరణం వెంకటేష్



బాపట్ల తరలి వెళుతున్న పర్చూరు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు

• యువతపోరుకు భారీగా తరలిన నేతలు

చీరాల: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగులకు భృతి లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కోరుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం యువతపోరు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. బాపట్ల జిల్లా కేంద్రంలో తలపెట్టిన కార్యక్రమానికి స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో బాపట్ల తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు పేరుకుపోయాయన్నారు. గత ప్రభుత్వం విద్యార్థులకు బాసటగా నిలిచిందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారం చేపట్టి తొమ్మిది నెలలు పూర్తవుతున్నా అమలుకు నోచుకోవడం లేదన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1000 కోట్లు విడుదల చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. దీని వల్ల పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కొన్ని కళాశాలల్లో ఫీజు కట్టకపోతే హాల్ టికెట్లు కూడా ఇవ్వని పరిస్థితి ఉందని, అప్పులు చేసి ఫీజులు కడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి మూడు నెలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తల్లుల బ్యాంకు ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అమలు కాని హామీలను కోకొల్లలుగా చెబుతూ ఓట్లు దండుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం తీరును ప్రజాక్షేత్రంలో ఎండగడతామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చినగంజాం: ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువత పోరు కార్యక్రమాని నేతలు బుధవారం భారీగా బాపట్ల తరలివెళ్లారు. పర్చూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో నియోజక వర్గంలోని ఆరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్ళారు. 25కు పైగా వాహనాల్లో సుమారు 150 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు వెళ్ళిన వారిలో ఉన్నారు. మండలాల కన్వీనర్లు జంపని వీరయ్య, చిన్నిపూర్ణారావు, కఠారి అప్పారావు, మున్నం నాగేశ్వరరెడ్డి, భవనం శ్రీనివాసరెడ్డి, కొల్లా వెంకటరావు, ఆసోది బ్రహ్మానందరెడ్డి, గాజుల రమేష్, బిల్లాలి డేవిడ్, ఉప్పలపాటి అనిల్, పులఖండం వెంకారెడ్డి, మువ్వల రాంబాబు, జి. రవిచందర్, దాసరి వెంకటరావు, కోట శ్రీనివాసరావు, కొల్లా సుబ్బారావు చౌదరి, గడ్డం మస్తాన్‌వలి, సుబ్బరామరెడ్డి, గేరా స్వరాజ్, పాదర్తి ప్రకాష్, ఎస్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం ఆదేశాల మేరకు జిల్లా కేంద్రమైన బాపట్లలో బుధవారం తలపెట్టిన యువతపోరుకు నేతలు తరలి వెళ్లారు. అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో వివిధ వాహనాల్లో బయలుదేరి వెళ్లారు. మండల కన్వీనర్లు, స్థానికనేతలున్నారు.



బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని సత్కరిస్తున్న బ్రహ్మానందరెడ్డి

దర్శి ఎమ్మెల్యేతో భేటీ

చినగంజాం: మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఆసోది బ్రహ్మానందరెడ్డి బుధవారం దర్శి శాసన సభ్యుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. చీమకుర్తిలోని ఆయన స్వగృహానికి వెళ్లి శాలువా కప్పి సత్కరించారు. నల్లమోపు జయసింహారెడ్డి, ఎం. హేమంత్‌కుమార్ రెడ్డి, కోట సుబ్బరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు సబ్సిడీపై యంత్ర పరికరాలు

చీరాల టౌన్: మండలంలోని బీసీలు, చేతివృత్తులపై ఆధారపడి జీవించే వారికి ఆదరణ–3 పథకంలో నూతన యంత్ర పరికరాలను ప్రభుత్వం అందిస్తుందని ఎంపీడీఓ బి.శివ సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం చీరాల ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో మండలంలోని చేతివృత్తులు, కుల వృత్తుల సంఘాల నాయకులు, కార్పొరేషన్ల ప్రతినిధులతో ఆదరణ–3 పథకంపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం గతంలో ఇచ్చిన ఆదరణ –2 పథకం మాదిరిగానే ప్రస్తుతం కూడా ఆదరణ పథకం –3లో చేతివృత్తులు, కుల వృత్తులు చేసుకుని జీవించే వారికి యంత్ర పరికరాలు అందించనుందన్నారు. చీరాల మండలంలో అధికంగా 60 శాతానికి పైగా బీసీలు, వివిధ రకాల చేతివృత్తులు, కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగించే వారు ఉన్నందున ఆదరణ పథకంలో యంత్ర పరికాలు అందించనున్నామన్నారు. చేనేతలకు నూతన సెన్సార్ మోటార్లు, రజకులకు



సమావేశంలో సూచనలందిస్తున్న ఎంపీడీఓ శివసుబ్రహ్మణ్యం

గ్యాస్ ఇస్త్రీ పెట్టెలు, నూర్‌బాషా సంఘం వారికి దిండ్లు తయారీ మిషన్లు, ఇతర యంత్ర పరికరాలు అందించాలని కోరారన్నారు. పథకంలో బీసీలకు యంత్ర పరికరాలు అందించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామని తెలిపారు. ఆదరణ పథకాన్ని బీసీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శివసుబ్రమణ్యం సూచించారు. ఈవోఆర్డీ రామకృష్ణ, పలు గ్రామాలకు చెందిన చేతివృత్తులు, కుల వృత్తుల సంఘాలు, చేనేత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆధునిక యంత్ర పరికరాలతో దిగుబడులు



పర్చూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

పర్చూరు(చినగంజాం): ఆధునిక యంత్ర పరికరాలతో అధిక దిగుబడులు సాధించవచ్చని పర్చూరు వ్యవసాయ శాఖ ఏడీఏ ఎన్. మోహనరావు అన్నారు. మండలంలోని గర్నెపూడి, కొల్లావారిపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి ఎస్. రామ్మోహనరెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. వ్యవసాయంలో ఆధునిక యంత్ర పరికరాలతో ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు గొర్రులు, ట్రాక్టర్ ఇంప్లిమెంట్స్, ట్రాక్టర్ స్ప్రేయర్‌లు, రోటోవేటర్‌లు, మల్టీ క్రాప్ థ్రెషర్స్, ప్రాసెసింగ్ యూనిట్‌లు, దాల్‌మిల్స్, తైవాన్ స్ప్రేయర్స్ ఇస్తున్నారని తెలిపారు. పంటల వేసిన రైతుల వివరాలను సోషల్ ఆడిట్ కోసం సేకరించామని వాటిలో తప్పులుంటే ఈ నెల 18 లోపు సరిచేసుకోవాలని తెలిపారు. తుది జాబితాను ఈ నెల 22వ తేదీన ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. బాపట్ల ఏడీఏ రత్నకుమారి, సర్పంచ్‌లు రామారావు, గ్రామ పెద్దలు వీఏఏలు హేమవర్ధిని, నవీన్, ఆదర్శ గ్రామ రైతులు పాల్గొన్నారు.



పర్చూరు: రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మోహనరావు



యద్దనపూడి: పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ మేరమ్మ

యద్దనపూడి: రైతులు తాము పండించిన పంటలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో పంట ఉత్పత్తులను అమ్ముకోవాలని వ్యవసాయాధికారి మేరమ్మ రైతులకు కోరారు. బుధవారం చిమటవారిపాలెం, వింజనంపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు. మండలంలో 5420 ఎకరాల్లో శనగపంట సాగు చేశారన్నారు. ప్రభుత్వం శనగకు క్వింటా మద్దతు ధర రూ.5650 ప్రకటించిందన్నారు. తమ పంట ఉత్పత్తులను ఆయా గ్రామాల్లో ఉన్న రైతుసేవా కేంద్రాల వద్దనే కొనుగోలు చేస్తామన్నారు. కేంద్రాలకు తీసుకువచ్చే సరుకులో నాణ్యత ప్రమాణాలు పాటించటంతో పాటు 12 శాతం తేమ ఉండేలా రైతులు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుదర్శన, లీలాసత్య, స్థానిక రైతులు పాల్గొన్నారు.

అద్దంకి: మద్దతు ధరకే రైతులు పండించిన శనగలు తదితర ధాన్యాలను కొనుగోలు చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ చెప్పారు. బుధవారం మండలంలోని వేలమూరిపాడులో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శనగలు క్వింటాలు ధర రూ.5650గా ప్రభుత్వం నిర్ణయించిదని చెప్పారు. రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు మొక్కజొన్న క్వింటా రూ.2225, కందులు రూ.7550గా కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే పీఎం కిసాన్ వస్తున్న రైతులు 3000 మంది విశిష్ట సంఖ్య కోసం నమోదు చేయించుకున్నారని చెప్పారు. ఇంకా నమోదు చేయించుకోని రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్దకు వెళ్లి చేయించుకోవాలని కోరారు.

కనీస మద్దతు ధర కల్పించాలి

పర్చూరు(చినగంజాం): రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలంటూ నల్లమడ రైతులు పర్చూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. నల్లమడ రైతు సంఘం అధ్యక్షులు డాక్టర్ కొల్లా రాజమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో రైతులు పాల్గొని పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొగాకు, మిర్చి, శనగ రైతులు గిట్టుబాటు ధర లేక అప్పులపాలు అయ్యే ప్రమాదం ఏర్పడిందని రాజమోహన్ అన్నారు. విదేశీ సిగరెట్‌లలో ఎక్కువగా ఉపయోగించే బర్లీ పొగాకుకు కూడా కనీస మద్దతు ధర లేదని వాపోయారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ బ్రహ్మయ్య అందజేశారు. రైతు సంఘం నాయకులు చుండూరు రంగారావు, విశ్రాంత ప్రొఫెసర్ విజయకుమార్, పర్చూరు వైస్ ఎంపీపీ పాలేరు వీరయ్య, మాజీ ఎంపీపీ కోట హరిబాబు, మల్లా శ్రీనివాసరావు, బాషా రైతులు పాల్గొన్నారు.

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

బల్లికురవ: మండలంలోని కొండాయపాలెం గ్రామ సమీపంలో సర్వేనంబర్ 243, 244 లో క్వారీ ఏర్పాటుపై గురువారం ఉదయం పర్యావరణ, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రవి నాయక్ బుధవారం తెలిపారు. చీరాల ఆర్డీవో చంద్రశేఖర నాయుడు హాజరవుతారని చెప్పారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియజేయవచ్చని వివరించారు.

పరీక్ష సమయంలోనైనా బస్సు నడపండి

అద్దంకి: మండలంలోని మైలవరం గ్రామం నుంచి వైదన గ్రామానికి పదో తరగతి పరీక్షల సమయంలోనైనా బస్సు నడపాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు.. ఉపాధ్యాయులు బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. శివారు గ్రామమైన వైదన గ్రామానికి, మైలవరం గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 45 మంది ఈ నెల 17వ తేదీ నుంచి ఉదయం 9 గంటలకే చేరుకోవాల్సి ఉంటుందదని ఆవేదన వ్యక్తం చేశారు. వాహన సదుపాయం లేని గ్రామానికి పరీక్షల సమయంలోనైనా బస్సు వసతి కల్పించాలని విన్నవించారు.

ఎస్సీ వర్గీకరణపై ఉన్న ప్రేమ సంక్షేమంపై లేదు



మాట్లాడుతున్న నీలం నాగేంద్రరావు

చీరాల రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్నది కూటమి ప్రభుత్వం కాదని, కులతత్వ ప్రభుత్వమని, చంద్రబాబుకు ఎస్సీ వర్గీకరణపై ఉన్న ప్రేమ దళితుల సంక్షేమంపై ఏ మాత్రంలేదని దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు విమర్శించారు. స్థానిక దళిత మహాసభ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా దినోత్సవం రోజున లక్షమంది మహిళలకు కుట్టు శిక్షణను ప్రారంభించిన కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ మహిళలకు అవకాశం కల్పించకపోవడం దారుణమన్నారు. అది కుల వివక్షకిందకు వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ మహిళలు మినహా బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు మహిళలకు రూ. 255 కోట్లతో శిక్షణనివ్వడంతో పాటు వారందరికి ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటింటికి సంక్షేమ పథకాలు అమలుచేస్తామని టీడీపీ, జనసేన, బీజేపీలు ఎన్నికలకు ముందు ప్రకటించాయని, కానీ నేడు ఒక్క పథకం కూడా అమలు చేయకుండా ప్రజలను మోసగిస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు యూనిట్లు గ్రౌండింగ్ చేస్తూ ఎస్సీలకు రుణాలు ఆపివేశారన్నారు. బాబు ఆయన 15 ఏళ్ల పాలనలో ఎస్సీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయలేదన్నారు. మాచవరపు జూలియన్, దారా అంజయ్య, కాకుమాను రవి, తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

బల్లికురవ: వేగంగా వెళుతున్న ఓ కారు క్రాస్ రోడ్డు వద్ద బైక్‌ను ఢీకొట్టటంతో ఒకరు గాయాలపాలయ్యారు. ఈ ఘటన బుధవారం బల్లికురవ– సంతమాగులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని సోమవరప్పాడు క్రాస్ రోడ్డు వద్ద జరిగింది. సోమవరప్పాడు గ్రామానికి చెందిన తంగిరాల చిన్న బైక్‌పై మరో వ్యక్తిని ఎక్కించుకుని బల్లికురవ వస్తుండగా సంతమాగులూరు నుంచి బల్లికురవవైపు వెళుతున్న కారు ఢీకొట్టింది.

తిరునాళ్లకు ముస్తాబైన శింగరకొండ

అద్దంకి రూరల్: తిరునాళ్ల సందర్భంగా గురువారం రాత్రి శింగరకొండ ప్రసన్నాంజనేయ దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేవస్థానం పక్కన విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన దేవతా చిత్రాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



విద్యుత్ దీపాలంకరణలో శింగరకొండ ప్రసన్నాంజనే స్వామి దేవస్థానం